# నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు

## కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్

మామిళ్లగూడెం, మే 6 : నిబంధనల ప్రకారం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయింపు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పైలెట్ గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతి, లబ్ధిదారుల ఎంపికపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. పైలెట్ గ్రామాల్లో 878 ఇళ్లు మంజూరు చేస్తే 409 ఇళ్లు బెస్‌మెంట్‌స్థాయి వరకు నిర్మించారని, 390మందికి మొదటివిడత రూ.లక్ష ఆర్థికసాయం విడుదల చేసిందని తెలిపారు. మిగిలిన గ్రామాలు, పట్టణాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతున్నదని తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, ఈఈ హౌసింగ్ శ్రీనివాస్, డీఈవో సత్యనారాయణ, ఆర్డీవోలు, మండల అధికారులు పాల్గొన్నారు.

**పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక**

జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు సంబంధించి రాజీవ్ యువ వికాసం కింద ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. ఎన్ని ధ్రువీకరణ చేశారు.. అర్హుల ఎంపికకు తీసుకున్న చర్యలు గురించి కలెక్టర్ మండలాల వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జూన్ 2 నాటికి యూనిట్ల గ్రౌండింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఈవో సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి**

మామిళ్లగూడెం, మే 6 : విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అవగాహన చేసుకుని కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మంగళవారం జిల్లాలోని వెనుకబడిన తరగతుల బాలుర, బాలికల కళాశాల వసతిగృహంలో ఉంటూ 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదువుతూ ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఇంటర్‌లో సీహెచ్ త్రివిక్రమ్-958, కె,రేష్మ-957మార్కులు సాధించనందుకు వారిని మెమెంటోతో సత్కరించి ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు ప్రోత్సాహకం అందించారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి జ్యోతి, డీఐఈవో రవిబాబు పాల్గొన్నారు.

# ఎన్ని ఇబ్బందులు వచ్చినా సంక్షేమం, అభివృద్ధి ఆగదు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం రూరల్: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, మే 6: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆపేది లేదని, పేదల కోసం ప్రారంభించిన పథకాలు అపే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని సీఎం చెప్పిన మాట వాస్తమని ఉద్యోగులు అర్థం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని, మొదటి విడత ఇళ్ల నిర్మాణానికి డబ్బులు ఉన్నాయన్నారు. విడతల వారీగా ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చుతామని కొంత సమయం పడుతుందన్నారు. పాలేరులో రూ.15 కోట్లతో డివైడర్, నాలుగు లైన్‌ల రోడ్లు, సెంట్రల్ లైటింగ్, నేలపట్లలో రూ.24 లక్షలతో సీసీ రోడ్డు, మల్లేపల్లిలో రూ.36 లక్షలు, జక్కేపల్లి ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆర్డీవో నర్సింహారావు, ఏసీపీ తిరుపతిరెడ్డి, తంబూరి దయాకర్ రెడ్డి, స్వర్ణకుమారి, మార్కెట్ చైర్మన్‌లు హరినాథ్ బాబు, సీతారాములు,ఆత్మా చైర్మన్ శివరామకృష్ణ, సీడీసీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**ధాన్యం తరుగు తీస్తే కఠిన చర్యలు**

రైతులకు ఇబ్బంది కలింగించే విధంగా తరుగు తీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి వారిని గుర్తించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో మిల్లర్ల సమస్యలపై వారితో మాట్లాడారు. తరుగు తీస్తున్నారనే వార్తలు వస్తున్నాయని, అది జరిగితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సన్న బియ్యాన్ని పరిశీలించారు.

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

ఖమ్మం రూరల్, మే 6: రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మండలంలో నిర్వహించనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తల్లంపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.52లక్షలతో సీసీరోడ్లు, రూ.6కోట్లతో పాలేరు గ్రామం నుంచి సూర్యాపేట, అశ్వారావుపేట సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, డ్రైన్ నిర్మాణ పనులు, రూ.1.50లక్షలతో నిర్మించనున్న మారెమ్మ టెంపుల్ -కేంద్రీయ విద్యాలయం రోడ్డు, కరుణగిరి జంక్షన్ అభివృద్ధి పనులు, గోళ్లపాడులో రూ.16లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పెద్దతండా గ్రామంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో జీ నర్సింహారావు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఎస్‌వో చందన్‌కుమార్, తహసీల్దార్ పీ రాంప్రసాద్, ఎంపీడీవో ఎస్ కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లాలో పలువురు సీఐలకు స్థానచలనం

మామిళ్లగూడెం, మే 6: ఖమ్మం జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలో పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. సీఐలను బదిలీ చేస్తూ మల్టి జోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన వారిలో ఖమ్మం ట్రాఫిక్ సీఐ జె.మోహన్‌బాబును ఖమ్మం టౌన్-3 ఎస్‌హెచ్‌వోగా, అక్కడ పని చేస్తున్న దోమల రమేష్‌ను టాస్క్‌ఫోర్సుకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న జె.రాకృష్ణను ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఐజీపీ కార్యాలయం లో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న తాటిపాముల కరుణాకర్‌ను ఖమ్మం టౌన్-1 ఎస్‌హెచ్‌వోగా నియమించారు. అక్కడ పని చేస్తున్న ఉదయ్‌కుమార్‌ను సీసీఎస్ ఖమ్మంకు బదిలీ చేశారు. సీసీఎస్‌లో పని చేస్తున్న బాలాజీని ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఖమ్మం టాస్క్‌ఫోర్సులో ఉన్న ఎస్.తిరుపతిని ఐజీపి కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారు వెంటనే విధుల్లో చేయాలని సూచించారు.

## హౌజింగ్ ఏఈలకు మండలాలు కేటాయింపు

గృహనిర్మాణ శాఖ బలోపేతం చేస్తూ ఔట్ సోర్సింగ్ పద్దతిన ఖమ్మం జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన 14 మంది ఏఈలకు మండలాలు కేటాయింపు పూర్తి చేస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ చాంబర్‌లో నూతన ఏఈలు కలెక్టర్‌ని కలిశారు. కేటాయించిన విధులు సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వారికి సూచించారు. ఏఈలు డీఈలకు వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించారు.

## 8న జాబ్ మేళా

మామిళ్లగూడెం, మే 6: ఉమ్మడి ఖమ్మంజిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతి యువకులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 8న ఉదయం 10గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి మాధవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళా నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల టేకులపల్లిలో ఉంటుందని పేర్కొన్నారు. జాబ్‌మేళాలో ఎంఆర్ఎఫ్ కంపెనీలో మెకానిక్ ఆపరేటర్‌గా పని చేసేందుకు ఆసక్తి ఉన్నవారు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి





ఖమ్మం రూరల్: వైద్యాధికారికి సమ్మె నోటీస్ అందజేస్తున్న ఆశా కార్యకర్తలు, కారేపల్లిలో..

ఖమ్మం రూరల్, మే 6: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రూ.50లక్షల ప్రమాద బీమా కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమళ్లపల్లి మోహన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఎం.వెంకటయపాలెం గ్రామంలో మండల వైద్యాధికారికి ఆశా కార్యకర్తలు ఈ నెల20వ తేదీ నుంచి సమ్మె చేపడుతున్నట్లు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ఆశాల సమ్మెకు సీఐటీయూ పూర్తి మద్దతు పలుకుతుందన్నారు. నరేంద్రమోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత కనీస వేతనాలు అమలు చేయడం లేదని, కార్మికులుగా గుర్తించడ లేదన్నారు. ఈ విధానం నిరసిస్తూ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల20నుంచి జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బీ మల్లేశ్వరీ, బీ జ్యోతి, భాగ్యమ్మ, సుభద్ర, ఉషా, నాగమణి, నీలిమా, కృష్ణవేణి, సూరమ్మ, ఆరుణ, తిరుపమ్మ, శ్రీవిద్య పాల్గొన్నారు.

**ఆశ వర్కర్ల సమ్మె నోటీస్**

కారేపల్లి, మే 6: స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలను రద్దు చేయాలని నిరసిస్తూ ఈ నెల 20 కార్మిక సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపు మేరకు మండల ఆశవర్కర్లు మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ సురేష్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్కీమ్ వర్కర్ల కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్లెబోయిన రాధా, జంగ కళ్యాణి, పద్మ, రాజేశ్వరి, ఆదెర్ల దేవకరణ, సీహెచ్. పుష్పలత, ఈశ్వరి, మంగ, కుమారి, సరస్వతి, చంద్రమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అండర్ కేబుల్ విద్యుత్ సరఫరాపై సమగ్ర సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసచారి

మధిర, మే 6: పట్టణంలో అండర్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరాపై మధిర సబ్ డివిజన్ కార్యాలయంలో ఖమ్మం సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసచారి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు భూగర్భ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్కూరు రింగ్ రోడ్డు నుంచి పట్టణంలోని నందిగామ బైపాస్‌రోడ్డు వరకు, ఆర్‌వీ.కాంప్లెక్స్ నుంచి బస్టాండ్ వరకు భూగర్భ కేబుల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలకు విద్యుత్ అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే విధంగా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. రెండురోజుల్లో సమగ్ర సర్వే నిర్వహించి టీజీఎన్‌పీడీసీఎల్ కంపెనీకి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఎస్ఈ తెలిపారు. సమావేశంలో వైరా డివిజన్ డీఈ శ్రీనివాసరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ హీరాలాల్, ఆర్ అండ్‌బీ డీఈ శంకర్‌రావు, మున్సిపల్ డీఈ నరేశ్‌రెడ్డి, ఏడీఈలు అనురాధ, నాగమల్లేశ్వరరావు, పట్టణ ఏఈ అనిల్ కుమార్, డీపీఆర్ తయారు చేసేఏజెన్సీ ప్రతినిధులు భరత్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాస్యత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

### అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, మే 6 : అక్షరాస్యత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్య, వయోజన విద్య కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 50వేలకు పైగా ఉన్న నిరక్షరాస్యులకు ఉల్లాస్ కార్యక్రమం అమలుకు లక్ష్యం నిర్దేశించిందన్నారు. మండలంలో వలంటీర్లను గుర్తించాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిఫాం క్లాత్ వచ్చిందని దానిని వెంటనే మహిళా సంఘూ ద్వారా కట్టి పాఠశాలకు పంపిస్తామని తెలిపారు. సమావేశంలో డీఈవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎరువులు పీవోపీ మిషన్ ద్వారానే అమ్మాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య

కూసుమంచి, మే 6: ఎరువులు పీవోపీ మిషన్ ద్వారానే అమ్మకాలు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పాలేరు, నాయకన్‌గూడెం, కూసుమంచిలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గడిచిన సంవత్సరం రికార్డులను పరిశీలించారు. రైతుల విషయంలో ఎలాంటి తప్పులు జరిగినా, వ్యాపారాల కోసం వత్తిడి చేసి అమ్మకాలు చేసినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. విత్తనాలు అమ్మేవారు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి రామడుగు వాణి, ఏఈవోలు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య విద్యార్థులకు డీఈవో అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో సత్యనారాయణ

ఖమ్మం అర్బన్, మే 6 : ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల వెలువడిన టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించగా మంగళవారం వారిని డీఈవో కార్యాలయంలో డీఈవో సామినేని సత్యనారాయణ అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో డీజీఎం చేతన్‌మాధుర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ టీఎల్ఎన్ శర్మ పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తుల స్వీకరణ

బోనకల్లు, మే 6: మండంలోని తూటికుంట్ల, సీతానాగారం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్లు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మధిర, బోనకల్లు తహసీల్దార్లు రాచబంటి రాంబాబు, అనిశెట్టి పున్నం చందర్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆర్ఐలు మైథిలి, నవీన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జీవీఆర్ ఓసీని సందర్శించిన సెక్యూరిటీ ఆఫీసర్

సత్తుపల్లి, మే 6: సింగరేణి కొత్తగూడెం ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ మంగళవారం సత్తుపల్లి జీవీఆర్ ఓసీని సందర్శించారు. గతంలో సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు స్థానంలో నూతనంగా విధులు చేపట్టిన అభిలాష్‌కు సెక్యూరిటీ సిబ్బంది స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సెక్రూరిటీ జమేదార్ విజయేందర్, మల్లేష్, రవీందర్‌రెడ్డి, జోషఫ్, నారాయణ, సుభాని, రవి పాల్గొన్నారు.

## ధాన్యం ఎగుమతుల పరిశీలన

మధిర, మే 6: మధిర మార్కెట్‌యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఎగుమతులను మంగళవారం మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు పరిశీలించారు. అక్కడ ఉన్న ఐకేపీ మహిళా అధ్యక్షురాలిని లారీలు సకాలంలో వస్తున్నాయా, గన్ని సంచులు సరిపడా ఉన్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి ఆదివారం వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎండబెడితే ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాటాలు వేయించి పంపిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొణిజర్ల, మే 6: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కొణిజర్ల, చిన్నగోపతి, గోపవరంలో బీటీ రోడ్డు, కొండవనమాల, చిన్నమునగాలలో సీసీ రోడ్డు, డ్రైనేజీకు శంకుస్థాపన, రాజ్యాతండా,ప్రగతినగర్, కాచారంలో సీసీరోడ్లు ప్రారంభోత్సవం చేశారు. చిన్నమునగాలలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. సూరంపల్లి రామారావు, వడ్డే నారాయణరావు, మాజీఎంపీపీ గోసు మధు, వత్సవాయి రవి, తాతా సుధాకర్, కొనకంచి మోషే పాల్గొన్నారు.

## మండలంలో భారీ వర్షం



ధాన్యంపై పట్టాలు కప్పిన రైతులు

కొణిజర్ల, మే 6: మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి భారీ ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. కల్లాల్లో ఆరబోసి ఉంచిన వరి, మొక్కజొన్న, మిర్చి వర్షానికి తడిసిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు రైతాంగం పట్టాలు, పరదాలు కప్పినప్పటికీ ఈదురుగాలులకు పట్టాలు ఎగిరి పోవడంతో పంటలు తడిసిపోయాయి. పలు చోట్ల చెట్లు, కొమ్మలు విరిగి పడగా పలుచోట్ల కరెంట్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో వాహన రాకపోకలకు స్వల్ప అంతరాయం కలగగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

**వార్షిక సర్వసభ్య సమావేశము**

**నోటీసు**

**స్తంభాద్రి పరస్పర సహాయ సహకార పొదుపు మరియు పరపతి సంఘం లిమిటెట్ సభ్యులకు తెలియజేయునది ఏమనగా! తేది. 17 మే 2025 (శనివారం)న సంఘం యొక్క యూనిట్ ఆఫీసు రోడ్ నెం.9, విద్యానగర్ కాలనీ, కొత్తగూడెం నందు ఉ॥ 11.00గంటలకు నిర్వహించబడు వార్షిక సమావేశమునకు హాజరు కావలసినదిగా మనవి.**

ఇట్లు : **కార్యనిర్వాహణ అధికారి**

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## సందీప్‌కు మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ



సందీప్‌ను పరామర్శిస్తున్న సండ్ర, తాతా మధు

సత్తుపల్లి, మే 5: తల్లాడ మం డలంలోని అం జనాపురం గ్రా మానికి చెందిన ఆత్మ డైరెక్టర్ మాజీ కేతినేని చలపతిరావు కుమారుడు సందీప్ ఇటీవల హైదరాబాద్‌లో ప్రమాదానికి గురయ్యా డు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం వారి ఇంటికెళ్లి సందీప్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్, తల్లాడ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, దుగ్గిరాల వెంకట్రావు, దిరిశాల దాసురావు, మువ్వా మురళీ పాల్గొన్నారు.

**పెనుబల్లిలో పరామర్శ..**

పెనుబల్లి, మే 6: మండలంలోని రామచంద్రరావుబంజర గ్రామంలో ఇటీవల మరణించిన మరకాల శ్రీను, పరిగడుపు దావీదు, చెన్ను చిట్టెయ్య కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. నివాళి అర్పించిన వారిలో పెనుబల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, యలమర్తి శ్రీను, మరకాల వెంకీ, మరకాల మధు, పరిగడుపు రాములు, చెన్ను మోహన్ రావు, మరకాల రాంబాబు, మరకాల ఆనందరావు, తడికమళ్ల జయరావు తదితరులు ఉన్నారు.

**మధిరలో జడ్పీ మాజీ చైర్మన్**



బాధితుడిని పరామర్శిస్తున్న లింగాల కమల్‌రాజు, నాయకులు

మధిర, మే 6: చింతకాని మండలం జగన్నాథపురం మాజీ సర్పంచ్ కోట సూర్యప్రకాశ్‌రావు భార్య, కుమారుడు ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మంగళవారం వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, మండల కార్యదర్శి వెంకటరామారావు, గ్రామస్తులు ఉన్నారు.

## ట్రైనీ ఐపీఎస్‌ను సత్కరించిన బీఆర్ఎస్ నేతలు



రుత్విక్‌సాయిని సత్కరిస్తున్న నాయకులు

మధిర, మే 6: ట్రైనీ ఐపీఎస్ కొట్టే రుత్విక్‌సాయి మధిర పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ట్రైనింగ్‌లో భాగంగా ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు తీసుకున్నారు. ట్రైనింగ్ పూర్తి చేసుకొని వెళ్తున్న ఆయనను బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపోతుల వెంకటేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు మంగళవారం సత్కరించి అభినందించారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజారక్షణ కోసం విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

## బాల్య వివాహాలు జరగకుండా చూడాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్

ఎర్రుపాలెం, మే 6: బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అమ్మాయికి 18, అబ్బాయికు 21 సంవత్సరాలు వయస్సు నిండిన తర్వాత వివాహం చేయాలని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ అన్నారు. మంగళశారం మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రశాంత్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకుంటే మానసికంగా, శారీరకంగా ఎదగపోవడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రంజిత్, కార్తీక్, అశ్విని, లక్ష్మీలోహిత, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, వేణుగోపాల్, లాతాశ్రీ, పద్మజారాణి, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఎస్సై రమేశ్‌కుమార్

ఎర్రుపాలెం, మే 6: చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎం.రమేష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టాన్ని ఎవరు చేతుల్లో తీసుకోవద్దని, పేకాట, కోడిపందాలు, బెట్టింగ్‌లు, గంజాయి రవాణా, ఇసుక, రేషన్ బియ్యం అక్రమ దందాలకు పాల్పడే వారిపై చర్యలు ఉంటాయన్నారు. మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రతిఒక్కరు కంకణబద్దులై ఉండాలన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్త కృష్ణ మృతి



ఖమ్మం రూరల్, మే 6: మండలంలోని ఆరెంపుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొప్పుల కృష్ణ (49) వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆటో నడిపాడు. స్వల్ప అస్వస్థకు గురైన కృష్ణ మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ మంగళవారం నాయకులతో కలిసి కృష్ణ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## లారీ, ఆటో ఢీ.. ఒకరి మృతి

వైరాటౌన్(తల్లాడ), మే 6: లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలైన ఘటన తల్లాడ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముదిగొండ మండలం వెంకటగిరి క్రాస్ రోడ్డులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆలకుంట నవీన్ (20), అతని సోదరి రజిత కలిసి గాంధీనగర్ గ్రామంలో మామిడి కాయలు కొనుగోలు చేసి తిరిగి ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో క్రీస్తుజ్యోతి కాలేజీ సమీపానికి రాగానే ఖమ్మం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ అక్కడికక్కడే మృతిచెందగా అతని సోదరి రజిత గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి మంగళ వారం ఫిజియోథెరపీ

వైరాటౌన్, మే 6: స్థానిక మండల వనరుల కేంద్రం వైరా వారి ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో కూడా ప్రతి మంగళ వారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. పాక్షిక పక్షవాతం, నడకలో సమస్యలు, ప్రత్యేక అవసరాలు గల బాల బాలికలు ఈ క్యాంప్‌లకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ వి.వసంత, ప్రత్యేక ఉపాధ్యాయులు తాళ్లూరి రవి, వీ.అజిత తదితరుల పాల్గొన్నారు.

## డయాలసిస్ బాధితునికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న గౌసుద్దీన్

కారేపల్లి, మే 6: కారేపల్లిలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన చిలుముల రాములు కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్న రాములుకు నలుగురు ఆడపిల్లలు. కుటుంబ పెద్ద అనారోగ్యానికి గురి కావడంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్ మంగళవారం రాములు వైద్య ఖర్చులకు నగదు అందజేశాడు. డొంకెన రవీందర్ గౌడ్, ఎండీ.ఖలీల్ ఉల్లాఖాన్, తాళ్లూరి కోటి, భూక్యా చందు నాయక్, ఎల్లబ్బాయి, వెంకటి పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**CHANGE OF NAME**

* I, **NALLAMOTHU HARITA** CHANGED MY NAME AS **NALLAMOTHU HARITHA,** W/O. NALLAMOTHU VEKATA ABBAIAH, R/O. H.NO. 3-2-170, VIDYANAGAR COLONY, CHUNCHUPALLI, KOTHAGUDEM - 507101, BHADRADRI KOTHAGUDEM DIST. T.G.

KMM -

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.